క్లుప్తంగా

భూగర్భ జలాల పెంపునకు కృషి

ముసునూరు: కార్యాలయ పైకప్పుల నుంచి జారే నీటితోనూ, ఇతర పద్ధతులతోనూ భూగర్భ జల మట్టం పెంచేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీడీ రోజ్‌లీల పేర్కొన్నారు. శుక్రవారం ఆమె రమణక్కపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. భూగర్భ జలం నిల్వ చేసే రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ రిజిస్టర్లో దిద్దుళ్లు, కొట్టివేతలు లేకుండా కూలీలతో సంతకాలు చేయించాలని, ఒకరి బదులు మరొకరు పనులకు హాజరు కావడాన్ని నివారించాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు.

పాఠశాల విద్యార్థుల ర్యాలీ

గంపలగూడెం: నాభూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం జాతీయ నాయకుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తోటమూల వరకు ర్యాలీ కొనసాగింది. పలువురు దేశ నాయకుల చిత్రపటాలను చేతపట్టుకొని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొల్లెపోగు కిరణ్ మాట్లాడుతూ దేశ నాయకుల సేవలను ఎన్నటికీ మరచిపోలేమని వారిని స్మరించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వారి ఆశయాలను నెరవేర్చేందుకు యువత కృషి చేయాలన్నారు.

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర సమగ్ర శిక్ష సంస్థ ఆధ్వర్యంలో కేతనకొండ ఎంపీపీ (కాచవరం) పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు అమరవీరుల జ్ఞాపకార్థం నామట్టి–నాదేశం నినాదంతో విద్యార్థులు వలయాకారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి, అనూరాధ, భవానీ, ఇర్ఫాన్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవం

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సంబరాలు ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడ నుంచి రింగ్‌సెంటర్‌కు చేరుకున్న స్వర్ణోత్సవ సంబరాల జాతాకు స్వాగతం పలికారు. రింగ్ సెంటర్‌లో యూటీఎఫ్ జెండా ఆవిష్కరించి ర్యాలీ జరిపారు. 50 ఏళ్లగా ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకై చేస్తున్న కృషినిగుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరావు, మాజీ గౌరవ అధ్యక్షుడు పాల్ బాబురావు, మండల శాఖ కార్యదర్శి రెడ్‌స్టార్, అధ్యక్షుడు కృష్ణారావు, ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ గణపతి

రూ.7 లక్షలతో అలంకరణ



మైలవరం: మైలవరంలో వినాయక చవితి పండుగ సందర్భంగా కోట వెనుక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం రూ.200, రూ.500 కరెన్సీ నోట్లు రూ.7 లక్షలతో అలంకరించారు. ఇటీవల ఇక్కడ 70 కిలోల కూరగాయాలతో అలంకరించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అదే విధంగా కరెన్సీ నోట్ల గణపతిని దర్శించేందుకు భక్తులు విశేష సంఖ్యలో వస్తున్నారు.

ఘనంగా వేణుగోపాలుని కల్యాణం

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం స్వామి కల్యాణం ఘనంగా జరిపారు. ప్రధాన అర్చకులు తిరునగరిగోపాలచార్యులు, అర్చక బృందంచే సత్యభామ, రుక్మిణిదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని సాంప్రదాయబద్ధంగా జరిపారు. 9 మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం/ నూజివీడు/మైలవరం/గంపలగూడె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాలు గ్రామాల్లో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైద్య శిబిరాల తేదీలను అధికారులు ప్రకటించారు. ఎంపీడీవో రామకృష్ణ నాయక్ ఆరోగ్య శిబిరాల షెడ్యూలు శుక్రవారం విడుదల చేశారు. నూజివీడు మండల పరదిధిలోని అన్నవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరించారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని కూనపురాజుపర్వ గ్రామంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారని శాసన సభ్యుని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గంపలగూడెం మండలంలోని ఆర్లపాడులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర విజయవంతం చేయాలి

గంపలగూడెం: యువత, విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందు ఆక్టోబర్‌లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ పీవీఎల్ నరసింహారావు తెలిపారు. గంపలగూడెం ఎంఆర్సీలో శుక్రవారం ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం తెలిపారు. పోటీల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనికి పార్టీని మరింత పటిష్టవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ 'ఆపు బాబు నాటకం, జగనే మా నమ్మకం' అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వచ్చే నెలలో గ్రామ గ్రామాన వైఎస్సార్ సీపీ కార్యక్రమాలను నిర్వహించనున్నామని, దీనిలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. గత చంద్రబాబు పాలన, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలనల మధ్య తేడాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని, ఆ దిశగానే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, రాబోయే ఆరు నెలలు కష్టపడి పనిచేయాలన్నారు. ఏపీ రాష్ట్ర కో పరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీలు అక్కినేని శ్రీవాణి, కోటగిరి రాజానాయన, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల అధ్యక్షులు పలగాని నరసింహారావు, మిద్దే బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగిరి పూర్ణిమ, నాయకులు చెలికాని బాబ్జీ, రాపర్ల సుబ్బారావు, గోళ్ల ఇస్సాకు, ఆరేపల్లి రాంబాబు, పల్లె రవీంద్రరెడ్డి, నందూరు భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

గుండె జబ్బులు రాకుండా జాగ్రత్త పడాలి



తిరువూరులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3 కే వాక్

తిరువూరు: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన విధానం, ఒత్తిడి కారణంగా చిన్నపిల్లలు, యువకులు సైతం గుండె జబ్బుల బారిన పడుతున్నారని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ హృదయ దినోత్సవ సందర్భంగా తిరువూరులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3కే నడక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని బోస్ సెంటర్లో జడ్జి ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ ప్రతిరోజూ నడవడం, వ్యాయామం, సైక్లింగ్ ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. గుండె జబ్బులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను డాక్టర్ తాఖ్యారి రామకోటేశ్వరరావు, పూర్ణానంద్ వివరించారు.

'వాహనమిత్ర' సభకు తరలిన లబ్ధిదారులు



మైలవరంలో బస్సులను ప్రారంభిస్తున్న అప్పిడి సత్యనారాయణరెడ్డి

మైలవరం: విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వాహన మిత్ర లబ్దిదారులకు నిధులు విడుదల కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి లబ్దిదారులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాలకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచనలతో తరలి వెళ్లారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి జండా ఊపి బస్‌లు ప్రారంభించారు. వెల్వడంలో గ్రామ పార్టీ అధ్యక్షుడుయరమల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావు బస్‌లు బయలు దేరదీశారు. ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జి.కొండూరు: విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన వాహన మిత్ర ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమానికి లబ్దిదారులు, పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ పిలుపు మేరకు మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల నుంచి లబ్దిదారులు, అభిమానులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో తరలి వెళ్లి సీఎం సభలో పాల్గొన్నారు.

మెరుగైన పనితీరుతోనే గుర్తింపు



సీఐ అంకబాబును సత్కరిస్తున్న డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్

నూజివీడు: ప్రతి ఉద్యోగికి సర్వీసులో బదిలీలు సర్వసాధారణమని, అయితే మెరుగైన పనితీరును కనబరిచిన అధికారులే డిపార్ట్‌మెంట్‌లోనైనా, ప్రజల హృదయాల్లోనైనా చిరస్థాయిగా నిలిచిపోతారని డీఎస్పీ ఈడే అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. నూజివీడు రూరల్ సీఐ అంకబాబు బదిలీ అయిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆయనకు పోలీసు అధికారులు పట్టణంలోని రాయల్ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ అంకబాబు 19 నెలల పాటు నూజివీడులో విధులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. సీఐ అంకబాబు దంపతులను డీఎస్పీ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. నూతన సీఐ పి.బాలసురేష్‌బాబు, టౌన్ సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఐలు తలారి రామకృష్ణ, వెంకటేష్, శాగం రాధాకృష్ణారెడ్డి, కుటుంబరావు, నంబూరు చంటిబాబు, ఎస్వై స్వామి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గేదెల కొనుగోలుకు రుణ సౌకర్యం

కనుమూరు(గంపలగూడెం): పాల ఉత్పత్తి పెరుగుదల చర్యలో భాగంగా గేదెల కొనుగోలుకు రైతులకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న పాల వెల్లువ, బ్యాంకు రుణంపై అవగాహన కల్పిస్తూ కనుమూరులో వినగడప, కొత్తపల్లి, అనుముల్లంక, కనుమూరు గ్రామాలకు చెందిన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.మేనేజర్ మాట్లాడుతూ గేదె లకొనుగోలుకు రూ.లక్ష, పోషణ ఖర్చులకు రూ.50 వేలు రుణం అందజేస్తామన్నారు. పశువైద్యాధికారి అభిలాష్, పశువైద్యులు సాయికృష్ణ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నూజివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను తరమివేయవచ్చని సెయింట్ థామస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ చిన్నపరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సెయింట్ థామస్ హైస్కూల్ ఎన్‌సీసీ విభాగం క్యాడెట్లు శుక్రవారం పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీని నిర్వహించి, రాజీవ్ సర్కిల్ ప్రాంతంలో రోడ్డు వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ వీవీ శ్రీనివాస్, క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాలి

నూజివీడు: దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాషగా, భారతదేశ అధికార భాషగా హిందీ విరాజిల్లుతోందని, దేశ సమైక్యతకు దోహదం చేసే హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రిటైర్డ్ ఎస్పీ గగ్గుటూరు రాజా కిషోర్ అన్నారు. హిందీ పక్షోత్సవ వేడుకలను పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. మరో అతిథి ఎస్ఎస్‌సీ బోర్డు రిటైర్డ్ కమిషనర్ ఎం.కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హిందీలో మాట్లాడటం నేర్చుకోవాలన్నారు. పలువురు విద్యార్థులు హిందీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మేరా మాటీ, మేరా భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం భాగవతుల హేమలత, ఉపాధ్యాయ సెక్రటరీ డీ మోహన్‌రావు, హిందీ విభాగాధిపతి షేక్ అబ్దుల్‌హక్, మాధురి, జ్యోతిశ్రీ, ఆర్.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

ముసునూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన శక్తిని వెలికి తీసి, వారిని ప్రోత్సహించడం అభినందనీయమని హెచ్ఎం సునీల అన్నారు. బాల బాలికల్లో దేశ భక్తి, గురు భక్తి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ, శ్రీ సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ముసునూరు హైస్కూల్ విద్యార్థులకు ఆచార్యదేవోభవ అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 126 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, విజేతకు గోల్డ్ మెడల్ అందజేయనున్నట్లు సేవా సమితి బాల వికాస్ విద్యా వాహిని రాష్ట్ర శిక్షకుడు బసవరాజు నాగేశ్వరరావు తెలిపారు. దాసిరెడ్డి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, టి. యువరాజు, పీడీ హేమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘ సమావేశం

నూజివీడు: స్థానిక పురపాలకసంఘం సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

కొణిజెర్ల(గంపలగూడెం): గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేస్తుందని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కొణిజెర్లలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.10.55 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఆయన శుక్రవారం సొసైటీ అధ్యక్షుడు నంబూరు వెంకట కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. దీనికి జిల్లా బ్యాంక్ నుంచి రూ.9.50 లక్షలు మంజూరు చేయగా, సొసైటీ రూ.1.05 లక్షలతో ఆరోప్లాంట్ నిర్మించామన్నారు. బొల్లా కరుణాకర్ రావు, కేడీసీసీ బ్యాంకు సూపర్వైజర్లు మల్లాది ఏసోబు, కొండయ్య, సొసైటీ సీఈఓ ఎస్ఎం సుభానీ, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఆక్టోబర్ 1న నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సేవకులు, వలంటీర్లు, విద్యార్థులు, పార్టీల నాయకులు సచివాలయ ఉద్యోగులు, పుర ప్రజలు భాగస్వాములుకావాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సచివాలయ ఉద్యోగులు ముందుగానే చేసుకుని, విద్యార్థులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని ఎస్ఆర్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరికీ ప్రధానమైందని, మనం రోడ్డుపై నడిచినా, వాహనంలో ప్రయాణించినా మన భద్రత మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించినప్పుడే రోడ్డుపై మన భద్రతకు భరోసా ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్, ఎన్ఎస్ఎస్ పీఓ కాజా రాగసాయిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పుట్లమ్మగట్టు వద్ద గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మాసాంతపు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి పట్టణ పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

తిరువూరు: పెండిగ్‌లో ఉన్న పన్నుల వసూళ్లకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆస్తిపన్ను బకాయిల వసూలుపై సమావేశం నిర్వహించారు. వాణిజ్య సముదాయాలు, గృహాలకు విధించిన పన్నుల వసూలు లక్ష్యాలను నిర్దేశిస్తున్నట్లు తెలిపారు. నగర పంచాయతీ దుకాణ సముదాయాల్లో అద్దె బకాయిలను కూడా యుద్ధప్రాతిపదికన వసూలు చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం పట్టణంలోని 12, 13 వార్డుల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అన్ని కుటుంబాలను ఆరోగ్య సిబ్బంది విధిగా సర్వే చేయాలని సూచించారు.

పరిశోధన రంగంలో డీప్ లెర్నింగ్‌తో మేలు

మైలవరం: ప్రస్తుత పరిశోధన రంగంలో డీప్ లెర్నింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ముఖ్యమైనవని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో డీప్ లెర్నింగ్–కాంప్రహెన్సివ్ టెక్నిక్స్, టాక్సానమి అప్లికేషన్ అనే అంశంపై శుక్రవారం ఒక రోజు జాతీయ వెబినార్ జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, వెబినార్‌లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణకు చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కే సతీష్‌కుమార్, హైదరాబాద్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ డీప్ లెర్నింగ్ నిత్య జీవితంలో ముఖ్యంగా వైద్య రంగం, వ్యాపార రంగంలో అవక తవకలను గుర్తించడం, సోషల్ మీడియాలో నకిలీ సమాచారాన్ని గుర్తించడం తదితర అంశాలను వివరించారు. కన్వీనర్ డాక్టర్ ఎస్.వెంకటాద్రి, అధ్యాపకులు, విద్యార్థులు, ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

185 మంది మహిళలకు వైద్య పరీక్షలు



గంపలగూడెంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న పద్మావతి, మాధవి

గంపలగూడెం: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే, కుటుంబం, సమాజం, సౌభాగ్యంగా ఉంటాయన్న ఆశయంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక జెట్ వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి తెలిపారు. గంపలగూడెం కడియాల మోహన్ మురళీ ఆసుపత్రిలో శుక్రవారం మహిళా ఆరోగ్య వికాస్‌లో భాగంగా కొల్లిపర సుమంత్, మనస్వినీశ్రావ్య సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ త్రిదండి చిన జీయర్‌స్వామి ఆదేశానుసారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గర్భాశయం ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా బాధితులను కాపాడవచ్చు అన్న అశయంతో ప్రధానంగా ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 1331 క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. వైద్యులు పద్మావతి, మాధవి 185 మంది మహిళలకు అవసరమైన స్కానింగ్‌లను, మందులను ఉచితంగా అందజేశారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ సత్యనారాయణ



ముసునూరులో ఈక్రాప్ నమోదును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్

ముసునూరు: ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరి అని నూజివీడు ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ సూచించారు. ముసునూరులో సాగులో ఉన్న వరి పంటల ఈ క్రాప్ నమోదును సూపర్ చెక్‌లో భాగంగా శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన పంటల నమోదు సక్రమంగా జరిగిందా? లేదా? అనే విషయంపై పరిశీలన చేశారు. పంటల నమోదు ప్రక్రియలో తప్పులు లేకుండా, సమగ్రంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు తాను పండిస్తున్న పంటలను తమ గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డు, పాస్ పుస్తకాలు, ఇతర ఆధారాలతో పంట (ఈ–క్రాప్) నమోదు చేయించుకోవాలన్నారు. సున్నా వడ్డీతో రుణ సదుపాయాలు, వైఎస్సార్ రైతు భరోసా, పంటల నష్ట పరిహారం, బీమా సదుపాయం, ఇన్ పుట్ సబ్సిడీ, సబ్సిడీ విత్తనాలు, సబ్సిడీ ఎరువులు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు తదితర పథకాల వర్తింపు కోసం ఈ–క్రాప్ నమోదు అవసరం అన్నారు. పంటల నమోదు అనంతరం ఈకేవైసీకూడా తప్పనిసరిగా చేయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్, వీఆర్వో యశోద, గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం





చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

తిరువూరు: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో తిరువూరు పట్టణంలో మూడు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. దారా టౌన్‌షిప్ లేఅవుట్‌లో వీటిని నిర్మించాలని తీర్మానించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసే నిమిత్తం రూ.24 లక్షలు కేటాయించడానికి, పలు వార్డుల్లో సీసీ రహదారులు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు నగర పంచాయతీ నిధులను మంజూరుకు తీర్మానించారు. ప్రధాన రహదారుల్లో పశువుల విచ్చలవిడి సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నందున, బందెల దొడ్డికి తరలించాలని కౌన్సిలర్లు కోరారు. వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

చాట్రాయి: గ్రామాల్లో ప్రజాప్రతినిధులను కలుసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని ఏపీ కోపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం విద్యా, ఆరోగ్యం, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం లేదని కృష్ణారావుపాలెం ఎంపీటీసీ సభ్యుడు చింతగుంట్ల వెంకటేశ్వరావు సభ దృష్టికి తీసుకురాగా ఆస్పత్రి మరమ్మతులు పూర్తి కాగానే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తామని సీహెచ్‌ఓ రమణ చెప్పారు. మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.17 లక్షలతో మరమ్మతులు చేపట్టామని ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు తెలిపారు. 33 జగనన్న లే అవుట్లల్లో రూ.4.60 కోట్లతో బోర్లు పైపులైన్ పనులు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్య ప్రసాదు సభకు వివరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబాబరెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ మురళీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల హర్షం

తునికిపాడు(గంపలగూడెం): వైఎస్సార్ వాహన మిత్ర 5వ విడత నగదును రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయడంపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి వాహనమిత్ర సహకారాన్ని క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారని పలువురు అటో డ్రైవర్లు కొనియాడారు. ఈ ఆర్థిక సహాయం కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో అర్హులకు అందరికి వాహనమిత్ర మంజూరయ్యేలా కృషి చేసిన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావును ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు సన్మానించారు.

'కాలగమనం' సినిమా సందడి



కాలగమనం చిత్రం ముహూర్తపు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నూజివీడులో సినిమా సందడి నెలకొంది. పట్టణానికి చెందిన యువ దర్శకుడు బుర్రి సుధాకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కాలగమనం' సినిమా ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తొలి క్లాప్ కొట్టారు. పట్టణంలోని రాయల్‌గ్రాండ్ హోటల్‌లో చిత్ర యూనిట్ అందరూ కలిసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లవి ప్రణవీ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో హీరోయిన్‌లుగా వర్ధమాన నటులైన మహేష్, లావణ్య నటిస్తున్నారు. తాడేపల్లిగూడేనికి చెందిన గోల్డ్ రెడ్డి మరో ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తెగుళ్లు సాకిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఏ.కొండూరు: మిర్చి పంటకు సోకుతున్న తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు ఎం.రాజశేఖర్, కే లక్ష్మీకళ పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో శుక్రవారం తెగుళ్ల సాకిన మిర్చి పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో తెగుళ్ల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మిరప పంటలకు బొబ్బర తెగులు సమస్య అధికంగా ఉందన్నారు. ఈ తెగుళ్ల నివారణకు వేప నూనె ఒక మిల్లీ లీటర్ లేదా ఎసిటామిప్రైడ్ మందు మూడు మిల్లీ లీటర్లు, పీప్రొనిల్ మందు రెండు మిల్లీ లీటర్లు వంతున లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పంట చుట్టూ రక్షణ పంటలు సాగు చేసుకోవాలని, జిగురు అట్టలు తప్పని సరిగా పెట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్, మండల ఉద్యాన అధికారి బి. నరేంద్రకుమార్‌క, ఏఈఓ రామచంద్రరావు ఎం.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.